క్లుప్తంగా

పేకాటరాయుళ్ల అరెస్టు

ఐనవోలు : ముగ్గురు పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సంఘటన మండలంలోని వడ్డెరగూడెం శివారులో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. పేకాడుతున్నారన్న సమాచారంతో ఘటనా స్థలంలో తనిఖీలు చేపట్టగా పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులు పరారీ కాగా మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వారి నుంచి రూ. 2010 నగదు, 2 సెల్‌ఫోన్లు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గైకాడి అనిల్‌కుమార్ తెలియజేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కమలాపూర్ : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి గాను 6 నుంచి 10వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ అనిత శనివారం ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100 సీట్లు, 7, 8, 9, 10వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లు భర్తీ చేసేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ విద్యార్థులు రూ.125, ఓసీ విద్యార్థులు రూ.200 రుసుము చెల్లించి, స్టడీ సర్టిఫికెట్, ఆధార్‌కార్డు, ఫోటో జత చేసి వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 7వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుందని, 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు.

జర్నలిస్టుల చేయూత



శాయంపేట : మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన జర్నలిస్టు కాశేశ్వరం సర్సయ్య తల్లి ఉప్పలమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం మండల జర్నలిస్టులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 11,500 ఆర్థికసాయం అందించారు. బాల్నె తిలక్ బాబు, సామల సూర్యప్రకాష్, ములుకుంట్ల వేణు, కొత్తపల్లి నవీన్, మంత్రి వెంటేశ్వర్లు, దుంపల మహేందర్‌రెడ్డి, చల్లా రాజిరెడ్డి, బలిజె వేణు, రంగు శ్రీధర్, రాజేందర్, వంశీ, రవీందర్, ప్రవీణ్, క్రాంతి, సతీష్ పాల్గొన్నారు.

బస్సు సర్వీసును పునరుద్ధరించాలి

ఆత్మకూరు : పెద్దాపూర్–పరకాల బస్సు సర్వీసును పునరుద్ధరించాలని కోరుతూ టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యదర్శి కందుకూరి నరేష్ కోరారు. ఈ మేరకు శనివారం ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందించారు. వరంగల్ వ్యవసాయ మార్కెట్ వరకు డబుల్‌రోడ్డు వేసి 7సంవత్సరాలు అయినప్పటికీ బస్సు సర్వీసును పునరుద్ధరించకపోవడం వలన మండలంలోని తిరుమలగిరి, కామారం, పెద్దాపూర్ గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

బలవంతంగా ఇంటి పన్ను వసూళ్లు తగదు

కాజీపేట: ప్రజల స్థితిగతులను పరిశీలించకుండా ఇంటి, నీటి పన్నుల వసూళ్లను బలవంతంగా చేపట్టడం మున్సిపల్ అధికారులు మానుకోవాలని పీఎసీఎస్ డైరెక్టర్, బీజేపీ నేత కాయిత రాజ్‌కుమార్ యాదవ్ సూచించారు. కాజీపేట మండలం సోమిడి గ్రామంలో పన్నులు కట్టని వారి ఇంటి తలుపులను తొలగించడం, వస్తువులను అధికారులు జప్తు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పన్ను చెల్లింపుదారులకు సమయం ఇచ్చి వసూళ్లు చేసుకోవాలని కోరారు.

కార్మికులకు చీరల పంపిణీ

మామునూరు: ఓరుగల్లు హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవ సంస్థ ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికులకు ఖిలా వరంగల్ మండలం బొల్లికుంటలో శనివారం చీరల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు మచ్చిక రాజు మాట్లాడుతూ కార్మికుల శ్రమ, సేవలను గుర్తించి చీరలు అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద విద్యార్థులకు చేయుతనందిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో శానిటరీ జవాన్ బండి శ్రీధర్, కందిక స్వామి, పసునూరి శ్రీధర్, మధుకర్ పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠ పోస్టర్ ఆవిష్కరణ

కరీమాబాద్: గ్రేటర్ వరంగల్ పరిధిలోని శంభునిపేట గణేష్‌నగర్‌లో ప్రతిష్ఠించనున్న అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన పోస్టర్‌ను వేద పండితులు, కమిటీ బాధ్యులు శనివారం ఆవిష్కరించారు. ఉత్సవాల్లో భాగంగా మార్చి 30వ తేదీన విశ్వక్సేనారాధన, స్వస్తి పుణ్యాహవచనం, రక్షాబంధనం, 31న గ్రామోత్సవం, యాగశాల ప్రవేశం, పంచసూక్త ఆవాహనం, స్థాపిత దేవతా హోమం, కుంకుమ పూజలు, పూర్ణాహుతి, తీర్థప్రసాద గోష్ఠి, ఏప్రిల్ 1వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, దిష్టికుంభం, మంగళశాసనం నిర్వహించనున్నట్లు వేద పండితులు వివరించారు.

అంతరాలు లేని విద్యనందించాలి

ఐనవోలు : మండలంలోని విద్యార్థులకు అంతరాలు లేని విద్య అందించాలని, పేద, ధనిక అనే తారతమ్యం లేకుండా పిల్లలందరూ ఒకే రకమైన విద్యాలయాల్లో చదివేందుకు కృషి చేయాలని టీపీటీఎఫ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బీమళ్ల సారయ్య అన్నారు. టీపీటీఎఫ్ ద్వితీయ రాష్ట్రవిద్యామహా సభలు ఖమ్మంలో ఈనెల 11, 12వ తేదీల్లో నిర్వహిస్తుండగా అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం మండల కేంద్రంలో ఆ సంఘం మండల బాధ్యుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సారయ్య మాట్లాడుతూ సమసమాజ స్థాపన విద్య ద్వారనే సాధ్యమని అభిప్రాయపడ్డారు. విద్య నేడు అంగడి సరుకుగా మారి ధనికులకు ఒక రకంగా, పేదవారికి మరోరకంగా అందుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతరాలు లేని విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని పిలుపునిస్తూ ఈనెల 11, 12వ తేదిల్లో నిర్వహించే సభను విజయవంతం చేసేందుకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. మహాసభలకు వక్తలుగా విద్యావేత్త ఏ నర్సింహారెడ్డి, ప్రొఫెసర్లు బుర్ర రమేష్, ఖాసీం, ముఖ్య అతిథులుగా ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ధనసరి సీతక్క తదితరులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో పాక శ్రీహర్షుడు, సత్యనారాయణ, మహేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, మహేందర్, లక్ష్మయ్య, పద్మ, శైలజ, మాధవి, భవన్, రేవతి, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు యూటీఎఫ్ విస్తృత స్థాయి సమావేశం

తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) హనుమకొండ జిల్లా విస్తృతస్థాయి సమావేశం దీన్‌దయాల్ నగర్ టీఎస్ యూటీఎఫ్ భవన్‌లో ఆదివారం నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా కార్యదర్శులు సీఎస్‌ఆర్ మల్లిక్, చుంచుకాల లింగారావు శనివారం సంయుక్త ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు సోమశేఖర్, మల్లారెడ్డి, రంజిత్‌కుమార్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. విద్యారంగ అంశాలపై చర్చించి ప్రభుత్వానికి సమస్యల పరిష్కారానికై ప్రతిపాదనలు చేయనున్నట్లు తెలియజేశారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఈ సందర్భంగా కోరారు.



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న టీపీటీఎఫ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సారయ్య

వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన స్పెషలాఫీసర్లు

ఐనవోలు : పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క, కమిషనర్ హన్మంతరావు, సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానీయా శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు మండలంలోని వివిధ శాఖలకు చెందిన జీపీ ప్రత్యేక అధికారులు తహసీల్దార్ కార్యాలయంలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, అధికారులు పలు సూచనలు చేసినట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. ఇటీవల నూతనంగా జీపీకి ప్రత్యేక అధికారులుగా నియమించబడిన అధికారులు మొదట గ్రామాల్లో పర్యటించి సమస్యలను తెలుసుకోవాలని వారు సూచించారు. వేసవికాలం సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీరు అవసరాలకు ఇబ్బందులు ఏర్పడకుండా చూడాలన్నారు. జీపీ ప్రత్యేక అధికారులు పంచాయతీరాజ్ చట్టం గురించి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక అధికారులతో కలిసి గ్రామాల్లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఎంపీడీఓ వెంకటరమణ కోరారు. ఈ కార్యక్రమంలో జీపీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఏపీఓ కుమారస్వామి, ఏపీఎం రాజ్‌కుమార్ పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన ప్రత్యేకాధికారులు

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



స్వయంపరిపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

దామెర : విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని దామెర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లకావత్ రాజేష్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో శనివారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో తమ అనుభూతిని వెల్లడించారు. ఈ సందర్భంగా రాజేష్‌కుమార్ మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పి విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉంటుందని అన్నారు. జిల్లా కలెక్టర్‌గా బి. పూజిత, ప్రధానోపాధ్యాయుడిగా బండి వివేక్, డీఈఓగా ఎం.లక్ష్మణ్, పాఠశాల చైర్మన్‌గా నాగరాజు, పలువురు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. పీఈటీ కమలాకర్, శ్రీలత, రమేష్, నవీన్, ఉమ, మహేష్, మాధవి, సుజన, వెంకట్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ మానవతా విలువలు పాటించాలి

ఐనవోలు : తల్లిదండ్రులను, గురువులను ఎల్లవేళలా పూజించి గౌరవించడంతో పాటు మానవతా విలువలు పాటించాలని స్వచ్ఛంద సామాజిక సేవా కార్యకర్త బంకా మాణిక్యరావు అన్నారు. మండలంలోని రాంనగర్‌లో శనివారం హెచ్‌ఎం బ్రహ్మచారి ఆధ్వర్యంలో మానవతా విలువలపై ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులకు మానవతా విలువలు, పెద్దలు చూపే మార్గంలో నడవడిక తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అదే విధంగా పరోపకారం అనే నాటికను విద్యార్థులతో కలిసి ప్రదర్శించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని విద్యార్థులకు సూచించారు. మంచిమార్గంలో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మాణిక్యరావు

కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకరి సస్పెన్షన్

పరకాల : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీని వీడి అధికారంలోకి రాగానే తిరిగి పార్టీలో చేరి కొందరిని తప్పుదోవ పట్టించి మైనార్టీ సెల్ పదవీ తెచ్చుకున్న ఎండీ అలీని సస్పెండ్ చేస్తూ పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ ప్రకటించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మైనార్టీ నాయకులతో కాంగ్రెస్ పట్టణ కమిటీ శనివారం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసింది. కొద్ది రోజుల క్రితం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ అధ్యక్షుడుగా తిరిగి నియామకమైన ఎం.డీ అలీని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల ముందు మైనారిటీ సెల్ అధ్యక్షుడి పదవిలో కొనసాగుతూ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ చేరి మైనారిటీల మనోభావాలను దెబ్బతీశారని ఆరోపించారు. ఈ మేరకు అలీని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ రాంమూర్తి, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు శ్రావణ్, కార్యదర్శి షఫీ, గౌరవ అధ్యక్షుడు వేణు, సమన్వయ కమిటీ సభ్యులు చందర్ తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యురాలికి అండగా ఉంటా..

హన్మకొండ: కారుణ్య నియామకాలు ఉత్తర్వులు అందిస్తున్న సమయంలో ఓ కారుణ్య నియామకురాలి దీనస్థితి విని రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ ఉద్వేగానికి లోనయ్యారు. హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ ఆవరణలో శనివారం జరిగిన కార్యక్రమంలో వరంగల్ రీజియన్‌లో ఆర్టీసీలో పనిచేస్తూ మృతి చెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కండక్టర్లుగా నియామక ఉత్తర్వులను మంత్రి అందించారు. ఈక్రమంలో హనుమకొండ పెద్దమ్మగడ్డకు చెందిన ఆర్.స్వప్నకు నియామక ఉత్తర్వులు అందిస్తుండగా ఆమె దయనీయ పరిస్థితిని మంత్రికి ఆర్టీసీ ఆర్‌ఎం జాస్తి శ్రీలత వివరించారు. మహాలక్ష్మి పథకంతో ఇప్పుడు ఆ అభాగ్యురాలికి ఉద్యోగం వచ్చిందని మంత్రికి వివరిస్తుండగా ఉత్తర్వులు అందుకున్న స్వప్న.. తన బాధను చెప్పుకుంటూ కంటతడి పెడుతూ ఒక్కసారిగా మంత్రి సురేఖను హత్తుకున్నారు. దీంతో మంత్రి సురేఖ ఉద్వేగానికి గురై ఆమె కుటుంబానికి అండగా ఉంటానని, పిల్లల చదువు కోసం చేయూతనందిస్తానని భరోసా ఇచ్చారు.



స్వప్నను ఓదార్చుతున్న మంత్రి సురేఖ

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 4న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ సాంబరెడ్డి తెలిపారు. స్నేహనగర్, రాఘవేంద్ర నగర్, ఎన్జీవోస్ కాలనీ రోడ్డు, శ్రీనగర్ కాలనీ వెస్ట్ అండ్ సౌత్ ప్రాంతాల్లో ఉదయం 9.30నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, పరిమళ కాలనీ, ఆర్టీసీ కాలనీ, పోలీసు కాలనీ, పూరిగుట్ట, ఫిల్టర్‌బెడ్ రోడ్డులో మధ్యాహ్నం2 నుంచి సాయంత్రం 5గంటల వరకు, మచిలీబజార్, పద్మాక్షి రోడ్డు, బస్టాండ్ రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8నుంచి 11 గంటల వరకు, బ్యాంక్ కాలనీ, టీచర్స్ కాలనీ, కాజీపేట మెయిన్ రోడ్డులో ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

టీజేఎస్ చైర్మన్ కోదండరాంను కలిసిన రైల్వే జేఏసీ నేతలు

కాజీపేట రూరల్: హనుమకొండ అంబేడ్కర్ భవన్‌లో శనివారం జరిగిన విభజన హామీలు, కేంద్ర ప్రభుత్వ వివక్ష, దగాపడ్డ ఓరుగల్లు సదస్సులో పాల్గొన్న టీజేఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాంను తెలంగాణ రైల్వే జేఏసీ చైర్మన్, కన్వీనర్ కోండ్ర నర్సింగరావు, దేవులపల్లి రాఘవేందర్ బృందం మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించింది. అనంతరం, కాజీపేట రైల్వే డివిజన్, కాజీపేట వ్యాగన్ మ్యాన్‌ఫ్యాక్షరింగ్ యూనిట్‌ను రైల్వే కోచ్ ఫ్యాక్టరీగా అప్‌గ్రేడ్‌గా చేయాలని కోరినట్లు వారు తెలిపారు. రైల్వే జేఏసీ కోకన్వీనర్లు సుధాకర్ రావు, భాస్కర్, వైస్ చైర్మన్లు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రేపటి ప్రజావాణి రద్దు

కరీమాబాద్ : వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. పరిపాలనాపరమైన కారణాలతో ప్రజావాణి నిర్వహించడం లేదని, జిల్లా ప్రజలు అర్జీలు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు రావొద్దని కలెక్టర్ కోరారు.

కొనసాగుతున్న 'స్పోకెన్ ఇంగ్లిష్'

కేయూ క్యాంపస్: కాకతీయ విశ్వవిద్యాలయ సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్) ద్వారా విద్యార్థులకు 'స్పోకెన్ ఇంగ్లిష్ – పర్సనాలిటీ డెవలప్‌మెంట్' తరగతులు జనవరి 22వ తేదీ నుంచి విజయవంతంగా కొనసాగుతున్నాయని సెల్ట్ సంచాలకులు డాక్టర్ ఆర్.మేఘనారావు తెలిపారు. ఇప్పటివరకు వివిధ అంశాలపై తరగతులు నిర్వహించినట్టు చెప్పారు. ముఖ్యంగా వాటిలో ఆంగ్ల భాషపై పట్టు సాధించటానికి మెలకువలు, ఇంటర్వ్యూలో పాటించాల్సిన నియమాలు వంటి పలు అంశాలపై సంబంధిత విభాగాల్లో నిష్ణాతులతో తరగతులు బోధిస్తున్నట్లు వివరించారు. ఈనెల 9వ తేదీ వరకు క్లాసులు కొనసాగుతాయని చెప్పారు. శనివారం జరిగిన శిక్షణ తరగతిలో 'పబ్లిక్ స్పీకింగ్' అంశంపై వీణారాజ్.. పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారని తెలిపారు.

కేవీలో గ్రాండ్ పేరెంట్స్ డే

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండలోని పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయ పాఠశాలలో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు నిర్వహించారు. కేవీ ప్రిన్సిపాల్ సుభాషిణి.. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. తల్లిదండ్రులతో పాటు తాతయ్య, అమ్మమ్మ, నాన్నమ్మలను చిన్నారులు గౌరవించేందుకు, ఆదరించేందుకు ఈ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తమ నాన్నమ్మ, అమ్మమ్మలకు విద్యార్థులు స్వాగతం పలికారు. చిన్నారులతో వారు మమేకమై ఆటపాటలతో అలరించారు.

వీధికుక్కల స్వైరవిహారం

వేలేరు : మండలంలోని పలు గ్రామాల్లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధాన రహదారులు, వీధుల్లో గుంపులుగా సంచరిస్తూ ప్రయాణికులపై దాడి చేస్తున్నాయి. రాత్రి సమయాల్లో ఒంటరిగా, వాహనాలపై వెళ్లే వారిపై అరుపులతో తరుముతున్నాయి. కుక్కలు ఎటువైపు నుంచి వచ్చి దాడి చేస్తాయోనని ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. కుక్కల ఒంటిపై చర్మం ఊడిపోయి, ఒంటి నిండా గాయాలతో కనిపిస్తుండడంతో వైరస్ సోకిందనే అనుమానంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి కుక్కల నివారణ చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం

● ప్రశ్నల వర్షం కురిపించిన సభ్యులు

శాయంపేట : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ తిరుపతిరెడ్డి అధ్యక్షతన ప్రారంభమైన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా కొనసాగింది. చలివాగు ప్రాజెక్టు మరమ్మతు పనులకు రూ.10కోట్ల 20లక్షల నిధులను అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి మంజూరు చేసినప్పటికీ పనుల ప్రారంభం కాలేదని ఎంపీటీసీ మేకల శ్రీనివాస్ సభ దృష్టికి తీసుకొచ్చారు. పరకాల నుంచి మూలతాళ్ల మీదుగా కొప్పుల వరకు రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. జేసీబీ మిషన్ రిపేరుకు రావడంతో చలివాగు మరమ్మతు పనులు నిలిచాయని త్వరలో ప్రారంభమవుతాయని ఏఈ అమృత్ తెలిపారు. పదవులు శాశ్వతం కాదని, పార్టీలకతీతంగా ఎంపీటీసీలకు నిధులు కేటాయించాలని నాలుగు ఏళ్ల పాలనలో తనకు రూ.1లక్ష 50వేల నిధులు మాత్రమే కేటాయించి మిగిలిన ఎంపీటీసీలకు ఎక్కువ నిధులు కేటాయించారని పత్తిపాక ఎంపీటీసీ గజ్జి ఐలయ్య సభలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక నుంచి అందరికి సమాన నిధులు కేటాయిస్తామని ఇంచార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా ముందుకెళ్లాలని ఎంపీపీ కోరారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, అధికారులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి

ప్లాస్టిక్ నిర్మూలనలో భాగస్వాములు కావాలి

కమలాపూర్ : ప్లాస్టిక్ నిర్మూలనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంజేపీ గురుకులాల ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్సీఓ మనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి ఇనుప రాడ్లతో తయారు చేసిన హబ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. పాఠశాల పరిసరాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను అందులో వేసి నిండిన తర్వాత బయట పడేసే విధంగా వల మాదిరిగా ఇనుప కంచెతో హబ్ తయారు చేసిన వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్లాస్టిక్ నిర్మూలన కోసం విద్యార్థులకు అవగాహన కల్పించామని, ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థులు ఇనుప కంచె హబ్‌ను తయారు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజేపీ బాలుర, బాలికల ప్రిన్సిపాల్స్ మల్లయ్య, ప్రఫుల్లాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రవి, డీడబ్ల్యూ రమేష్, ఉపాధ్యాయులు రషీద్, చంటి, నాగరాజు, శ్రావణ్, రమేష్ పాల్గొన్నారు.



హబ్‌ను ప్రారంభించిన ఆర్సీఓ మనోహర్‌రెడ్డి

మద్యం మత్తు ప్రాణాలను హరిస్తుంది

● సీఐ మల్లేశ్

శాయంపేట : మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రాణాలు కోల్పోవద్దని సీఐ మల్లేశ్ అన్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు శనివారం రాత్రి మండలంలోని మైలారం గ్రామంలో పోలీస్ కళాజాగృతి ఆధ్వర్యంలో మద్యం సేవించడంతో జరిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. యువకులు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యం మత్తులు వాహనాలు నడిపి ప్రాణాలు తీసుకోవద్దని, కన్నవారిని శోకసంద్రంలో నెట్టొదన్నారు. అలాగే ఇటీవల కాలంలో సైబర్‌క్రైమ్ నేరాలు పెరిగిపోతున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆపద సమయంలో డయల్ 100 వినియోగించుకోవాలని సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించడమే గాక నేరస్తులను త్వరితగతిన పట్టుకునేందుకు వీలుంటుందన్నారు. గుట్కా, గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాలకు యువకులు దూరంగా ఉండాలన్నారు. మూఢనమ్మకాలు, తదితర అంశాలపై పాటల ద్వారా, సాంస్కృతిక ప్రదర్శన ద్వారా ప్రజలకు కళాబృంద సభ్యులు అవగాహన కల్పించడం సంతోషకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై దేవేందర్, జాగృతి కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, కళాకారులు విలియం, వెంకటేశ్వర్లు, రత్నయ్య, శ్రీనివాస్, విక్రమ్, చిరంజీవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ మల్లేష్

'పున్నేలులో' ఫుడ్ ఫెస్టివల్

ఐనవోలు : మండలంలోని పున్నేలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పోషక విలువలతో కూడిన ఫుడ్ ఫెస్టివల్ శనివారం నిర్వహించినట్లు హెచ్‌ఎం రాయరాకుల పరమేశ్వర్ తెలిపారు. 20 మంది విద్యార్థులు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలు తీసుకురాగా అందులో ముగ్గురికి బహుమతులు అందజేసినట్లు చెప్పారు. ముఖ్య అతిథిగా హాజరైన కాంప్లెక్స్ హెచ్‌ఎం మాధవి మాట్లాడుతూ.. బయట ఆహారం తినకూడదని, పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ఇంట్లోనే తయారు చేసుకుని తినాలని వివరించారు. మొదటి బహుమతి తాటికాయల శ్రుతి(రాగి లడ్డు), రెండో బహుమతి ఎస్‌కే అఫ్రీన్ (పాయసం), మూడో బహుమతి కోట కావ్య (పరమాన్నం) తయారు చేయగా వారికి బహుమతులు అందించారు. విద్యార్థులు చదువుతో పాటు వివిధ రంగాల్లో రాణించాలని కోరారు. వసంత, మచ్చ యాకయ్య, కొమురయ్య, ఇందిరా, స్వప్న, నరేందర్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న హెచ్‌ఎంలు

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

శాయంపేట : డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు దాటిన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి గాజర్ల అశోక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 2023 నవంబర్ 1లోపు డిగ్రీ పూర్తి అయిన పట్టభద్రులు ఫిబ్రవరి 6 లోపు ఓటర్లుగా నమోదు చేసుకోవాలని, గతంలో ఓటు హక్కు పొంది ఉన్నప్పటికీ మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు పల్లె రాజేందర్‌రెడ్డి, మార్క విజయ్, మాజీ జెడ్పీటీసీ చల్లా చక్రపాణి, మండల ప్రధాన కార్యదర్శులు చిందం రవి, మారెపల్లి రవీందర్, వలిహైదర్, నాయకులు కృష్ణమూర్తి, వరద రాజు, ప్రపంచరెడ్డి, చిరంజీవి, రజనీకాంత్, కుమార్, కొమురయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : పట్టభద్రులంతా ఈనెల 6వ తేదీలోపు ఓటరుగా నమోదు చేసుకోవాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు అబ్బు బుచ్చిరెడ్డి కోరారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అన్నారు. మండలంలోని పట్టభద్రులు నిర్లక్ష్యం వహించొద్దని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధానకార్యదర్శి భుజంగరావు, నిర్మలకుమారి, ఉపేందర్‌రెడ్డి, సోమయ్య, శ్రీనివాస్, శ్రీదేవి పాల్గొన్నారు.



శాయంపేట : మాట్లాడుతున్న అశోక్